సాక్షి
అనకాపల్లి
గురువారం । 1 । మే । 2025

శోక సంద్రంలో మృతుల కుటుంబ సభ్యులు





శిథిలాలు తొలగిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్

హా.. నరహరీ

ఆర్తనాదాలతో మార్మోగిన సింహగిరి

- పాలకుల నిర్లక్ష్యానికి ఏడు ప్రాణాలు బలి
- సింహాచలం చరిత్రలోనే తొలిసారి విషాదం
- మృత్యుఘోష వినకుండా.. దర్శనాలపైనే వీవీఐపీల దృష్టి
- వీఐపీ దర్శనాల కోసమే పనిచేసిన మంత్రుల కమిటీ

సాక్షి, విశాఖపట్నం : నిత్యం నృసింహుని నామస్మరణతో పులకించే పవిత్ర సింహగిరి.. భక్తుల ఆర్తనాదాలతో కన్నీటి సంద్రమైంది. గోవిందా.. గోవిందా.. సింహాద్రి అప్పన్నా.. కాపాడు అని ఆ దేవ దేవుడిని వేడుకునే భక్తకోటి గొంతులే.. ప్రాణభయంతో రక్షించండి.. చచ్చిపోతున్నాం అంటూ హాహాకారాలు పెట్టాయి. సింహాద్రినాథుని నిజరూప దర్శనం కోసం వచ్చిన భక్తుల ఆశలు అక్కడికక్కడే సమాధి అయ్యాయి. స్వామి దర్శనానికి అడుగుల దూరంలో ఉండగానే.. కొందరు అనంతలోకాలకు చేరుకున్నారు. సింహాచలం దేవస్థానం చరిత్రలో ఎన్నడూ కనీవినీ ఎరుగని ఈ మహా విషాదం.. పాలకుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం. కనులపండువగా జరగాల్సిన చందనోత్సవం.. ప్రభుత్వ ఘోర నిర్లక్ష్యం, మంత్రుల ప్రచార యావ, ప్రజాప్రతినిధుల సేవలో తరించిన అధికారుల చేతకానితనంతో తీరని దుఃఖాన్ని, అంతులేని వేదనను మిగిల్చింది. ఏడు నిండు ప్రాణాలను బలిగొన్న ఘోర వైఫల్యోత్సవంగా.. ఈ చందనోత్సవం చరిత్రలో నిలిచిపోతుంది.



సహాయక చర్యల్లో కలెక్టర్ హరేంధిర ప్రసాద్

భక్తుల ప్రాణాలకు విలువేదీ?

రెండు వారాలుగా ఐదుగురు మంత్రుల కమిటీ పేరుతో జరిగిన హడావుడి అంతా ఇంతా కాదు. సమీక్షల మీద సమీక్షలు, పకడ్బందీ ఏర్పాట్లంటూ ప్రగల్భాలు పలికారు. కానీ.. క్షేత్ర స్థాయిలో జరిగింది శూన్యం. ఏటా చందనోత్సవం రోజు వర్షం కురవడం ఆనవాయితీ. ఈ చిన్నపాటి ముందుచూపు కూడా లేకుండా.. కనీస రక్షణ చర్యలు చేపట్టకుండా అధికారులు, మంత్రులు ఏం చేశారని భక్తులు ప్రశ్నిస్తున్నారు. వారి దృష్టి అంతా వీఐపీ టికెట్ల పంపకాలు, ప్రచార ఆర్భాటంపైనే కేంద్రీకృతమైంది తప్ప.. సామాన్య భక్తుల సౌకర్యాలు, భద్రత పట్టలేదు. ఫలితం ఈ ఘోర విషాదం.

కటిక చీకటి.. అంతలోనే భారీ శబ్దం

'జోరువాన.. భయంకరమైన గాలి.. కటిక చీకటి.. అంతలోనే భారీ శబ్దం. ఏం జరిగిందో చూసేలోపే.. మా ముందున్న వాళ్లు గోడ శిథిలాల కింద నలిగిపోయారు. అప్పటి దాకా గోవింద నామస్మరణతో మాతో పాటే నడిచిన వారు.. కళ్ల ముందే విగతజీవులుగా మారిపోయారు.' ప్రమాదం నుంచి బయటపడిన ప్రత్యక్ష సాక్షులు ఆ భయానక క్షణాలను గుర్తుచేసుకుంటూ వణికిపోయారు.



శిథిలాల కింద మృతదేహాన్ని తాళ్లు, రాడ్లతో తీస్తున్న రెస్క్యూ టీమ్

చీకటిలో మృత్యు ఘోష

బుధవారం వేకువజామున 2.22 గంటలకు ఈదురుగాలులు మొదలయ్యాయి. 2.25 గంటలకు గాలుల తీవ్రత పెరిగింది.. అప్పటికే వేలాది మంది భక్తులు క్యూల్లో దర్శనం కోసం ఎదురు చూస్తున్నారు. 2.30 గంటలకు వర్షం ప్రారంభమైంది. 2.45 గంటలకు ఈదురుగాలులతో భారీ వర్షంగా మారింది. క్యూల్లో వేల మంది భక్తులు తలదాచుకునేందుకు సరైన వసతి లేదు. రూ.300 టికెట్ క్యూల్లోని భక్తులు వర్షపు నీరు రాని చోట ఆగారు. మరికొందరు తడిసి ముద్దవుతూనే స్వామి దర్శనం కోసం ముందుకు కదిలారు. సరిగ్గా కొత్త షాపింగ్ కాంప్లెక్స్ పైభాగం నుంచి ఇంకో 100 మీటర్లు ముందుకు వెళ్తే స్వామి దర్శనం కలుగుతుంది. ఇంతలో ఊహించని విపత్తు.. సరిగ్గా 3.05 గంటలకు కొత్తగా నిర్మించిన గోడపైకి వరదనీరు వచ్చింది. దీంతో గోడ బీటలు వారింది. టెంట్ గోడపైనే ఏర్పాటు చేయడంతో ఈదురుగాలులకు కూలిపోయింది. అదే సమయంలో గోడ ఒక్కసారిగా కుప్పకూలి భక్తులపై పడింది. గోడ శిథిలాల కింద ఏడుగురు భక్తులు చిక్కుకొని మృత్యు ఒడికి చేరారు.

శవాలపైనా నిలబడ్డారయ్యా!

ఓవైపు శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించాలన్న ఆరాటం.. మరోవైపు కుండపోత వర్షం, చీకటి. 'కాపాడండి.. మా వాళ్లు కింద ఉన్నారు' అంటూ భక్తులు పెట్టిన రోదనలు మిన్నంటాయి. కొందరు భక్తులు, అన్నవరం నుంచి వచ్చిన ఓ ఉద్యోగి తమ ప్రాణాలను సైతం లెక్కచేయక శిథిలాలను తొలగించే ప్రయత్నం చేశారు. సహాయక సిబ్బంది వచ్చేలోపు ఒక్కరినైనా కాపాడలేమా అని విశ్వప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు హుటాహుటిన చేరుకున్నాయి. అయితే ఆ చీకటిలో ఎవరు ఎక్కడున్నారో తెలియక.. శిథిలాల తొలగింపులో భాగంగా సహాయక సిబ్బంది మృతదేహాలపైనే నిలబడటం చూసి.. 'అయ్యా.. మా వాళ్ల శవాలపై నిలబడ్డారు.. దయచేసి పక్కకు జరగండి' అని బంధువులు వేడుకోవడం అక్కడి దుస్థితికి అద్దం పట్టింది. సుమారు రెండున్నర గంటల శ్రమ అనంతరం మృతదేహాలను వెలికితీసి పోస్ట్‌మార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు.

ఐదుగురు మంత్రుల కమిటీ ఏం చేసింది?

ఘటన జరిగిన సమయంలో అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు, ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు, ప్రభుత్వ విప్ గణబాబు సహా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు వీఐపీ దర్శనాల కోసం ఆలయంలోనే ఉన్నారు. పక్కనే ఇంత ఘోరం జరిగినా.. భక్తులు ఆర్తనాదాలు పెడుతున్నా.. వారు అటువైపు కన్నెత్తి చూడకపోవడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ఐదుగురు మంత్రుల కమిటీ సమీక్షలు, ఏర్పాట్లపై చేసిన ప్రగల్భాలు ఏమయ్యాయని భక్తులు ప్రశ్నిస్తున్నారు. కేవలం వీఐపీ టికెట్లు ఎవరు ఎన్ని పంచుకోవాలన్న దానిపైనే మంత్రుల కమిటీ సమీక్షలు నిర్వహించిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంత్రుల సేవలో తరించిన అధికారులు.. భక్తుల ప్రాణాలను గాలిలో కలిపేశారని, ఈ పాపం ప్రభుత్వానిదేనని కన్నీటిపర్యంతమయ్యారు.

ఆ ఇద్దరూ ఎక్కడ?

- విషాదాన్ని పట్టించుకోకుండా విహారానికి..
- పల్లా, శ్రీభరత్ తీరుపై సర్వత్రా ఆగ్రహం

సాక్షి, విశాఖపట్నం : చందనోత్సవం వేళ సింహగిరిపై ఊహకందని పెను విషాదం జరిగినా.. ఇద్దరు టీడీపీ కీలక నేతలు మాత్రం ఏమి పట్టనట్లుగా వ్యవహరించారు. ఇందులో ఒకరు విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్‌కాగా.. మరొకరు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు. వేకువ జామునే దర్శనానికి వచ్చిన వీరిద్దరికీ.. ప్రమాదం గురించి తెలిసినా కనీసం అటువైపుగా రాలేదు. నిజరూప దర్శనం పూర్తి చేసుకున్న తర్వాత శ్రీభరత్ ఢిల్లీ వెళ్లిపోగా.. పల్లా శ్రీనివాసరావు విజయవాడలో పెళ్లికి పయనమయ్యారు. ప్రధాన దేవాలయంలో మహా విషాదం అలుముకున్నా పట్టించుకోకుండా.. తమ సొంత వ్యాపకాలకే ప్రాధాన్యమివ్వడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.



సొమ్మసిల్లిపోయిన మృతుల బంధువు



పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను తరలిస్తున్న పోలీసులు



బోరున విలపిస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మహేష్ తల్లి శాంతి, సోదరి, బంధువులు



పోస్టుమార్టం పత్రాలపై సంతకాలు పెట్టమని మహేష్ తండ్రిపై ఒత్తిడి చేస్తున్న ఎస్‌ఐ

బాధిత కుటుంబాలకు భరోసా



మహేష్, శైలజ కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- సాయంత్రం విశాఖకు వచ్చిన మాజీ సీఎం జగన్
- నేరుగా చంద్రంపాలెంలో బాధిత కుటుంబం ఇంటికి పయనం
- ఆయనను విశాఖకు రానీయకుండా చేసేందుకు కూటమి విశ్వప్రయత్నాలు
- హడావుడిగా పోస్టుమార్టం నిర్వహణ
- అయినప్పటికీ బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పిన జగన్

విశాఖ సిటీ: సింహాచలంలో గోడ కూలి మరణించిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించడానికి మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నారన్న వార్త కూటమి ప్రజా ప్రతినిధుల్లో వణుకు పుట్టించింది. జగన్ నేరుగా కేజీహెచ్‌కు వచ్చి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడతారని ముందు షెడ్యూల్ రావడంతో వెంటనే మంత్రులు, ఎమ్మెల్యేలు అలెర్ట్ అయిపోయారు. కేజీహెచ్ మార్చురీ వద్ద హడావుడి చేశారు. మృతదేహాలకు వెంటనే పోస్టుమార్టం నిర్వహించాలని వైద్యాధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. కుటుంబ సభ్యుల సంతకాలు లేకుండానే పోస్టుమార్టం చేసి తరువాత ఆ తతంగాన్ని పూర్తి చేశారు. మృతదేహాలను కేజీహెచ్ నుంచి వారి ఇళ్లకు పంపించే ఏర్పాట్లు చేశారు. వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి సాయంత్రం 4.50 గంటలకు విశాఖకు వచ్చారు. ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా చంద్రంపాలెంలో ఉన్న మృతులు పిల్లా ఉమామహేశ్వరరావు, పిల్లా శైలజ కుటుంబ సభ్యుల ఇంటికి వెళ్లారు. అక్కడ వారికి ధైర్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పార్టీ తరఫున మరణించిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడి ప్రభుత్వ తీరును ఎండగట్టారు. అక్కడి నుంచి విమానాశ్రయానికి చేరుకొని 7.15 గంటలకు విజయవాడకు తిరుగుపయనమయ్యారు. అంతకుముందు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విశాఖ విమానాశ్రయంలో పార్టీ శ్రేణులు స్వాగతం పలికారు.

సింహాచలం ఘటన ప్రభుత్వ నిర్లక్ష్యమే..

- కుటుంబాలకు రూ.కోటి, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి
- మాజీ మంత్రి అమర్‌నాథ్ డిమాండ్



మాట్లాడుతున్న మాజీ మంత్రి అమర్‌నాథ్

డాబాగార్డెన్స్/ఆరిలోవ: సింహగిరిపై గోడ కూలిన ఘటనలో చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు రూ.కోటి నష్ట పరిహారంతో పాటు శాశ్వత ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని వైఎస్సార్ సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. కేజీహెచ్ వద్ద మృతుల కుటుంబ సభ్యులను విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, సమన్వయకర్తలు మజ్జి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, పార్టీ నాయకులు కొండా రాజీవ్‌గాంధీ, పేడాడ రమణికుమారి, ద్రోణంరాజు శ్రీవత్సవ్, రవిరెడ్డి, జియ్యాని శ్రీధర్, పలువురు నాయకులతో కలిసి పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానానికి వైకుంఠ ఏకాదశి ఎంత పవిత్రమో.. సింహాచలానికి చందనోత్సవం అంత పవిత్రమని చెప్పారు. సుమారుగా 2 నుంచి 3 లక్షల వరకు భక్తులు వస్తారని తెలిసీ కూడా అవసరమైన ఏర్పాట్లు చేయకుండా నిర్లక్ష్యం వహించారని మండిపడ్డారు. కొండవాలులో ఎంతో పటిష్టంగా నిర్మించాల్సిన రక్షణ గోడను ఫ్లైయాస్ ఇటుకలతో నిర్మించడమే గాక పెండాల్స్‌ను గోడకు కట్టడం.. ఫలితంగా ఏడుగురు భక్తుల ప్రాణాలు తీశారన్నారు. ఈ ఘటనతో ప్రభుత్వ నిర్లక్ష్యం.. చేతగానితనం తేటతెల్లమైందన్నారు. భక్తులకు చేసిన ఏర్పాట్లు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయన్నారు. మృతుల కుటుంబాల రోదన అంతా ఇంతా కాదన్నారు. ప్రభుత్వం ఈ ఘటనను కూడా రాజకీయం చేయడం దారుణమన్నారు. చనిపోయిన వారి కుటుంబానికి రూ.కోటి పరిహారం, శాశ్వత ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఇది 'కూటమి' వైఫల్యమే..

చందనోత్సవంలో ఇంతటి ఘోరం జరగడం దిగ్భ్రాంతి కలిగించిందని మాజీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రస్తుత ఘటన నిస్సందేహంగా కూటమి ప్రభుత్వ వైఫల్యమేనని ఆరోపించారు.

జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్‌తో గ్రామాల అభివృద్ధి

- జిల్లాలో ఆరు మండలాలు, 10 గ్రామాల గుర్తింపు

తుమ్మపాల : జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకం కింద జిల్లాలో ఆరు మండలాలు, 10 గ్రామాలను గుర్తించినట్టు జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ పథకం అమలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాతవరం మండలంలో సరుగుడు, రావికమతం మండలం చీమలపాడు, కొట్నాబిల్లి, మాడుగుల మండలం శంకరం, తాటిపర్తి, చీడికాడ మండలం కోనాం, దేవరాపల్లి మండలంలోని వాలబు, సమ్మెట, చింతలపూడి, నక్కపల్లి మండలంలోని చీడిక గ్రామాలను గుర్తించినట్టు తెలిపారు. గిరిజనుల సామాజిక ఆర్థిక పరిస్థితులు మెరుగుపరచడం, 17 శాఖలకు సంబంధించి అంతరాలను గుర్తించి, ఆయా గ్రామాల్లో మౌలిక సదుపాయాలను సంతృప్తి స్థాయిలో కల్పించడం, గిరిజనులను సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చెందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి, మండల స్థాయి కమిటీల్లో జిల్లా స్థాయిలో చైర్మన్‌గా కలెక్టర్, 17 శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారని, మండల స్థాయిలో ఎంపీడీవో చైర్మన్‌గా, ఇతర మండల స్థాయి అధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో తాగునీరు, విద్యుదీకరణ, సోలార్ విద్యుత్, అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్ల నిర్మాణం, గిరిజనుల వ్యక్తిగత అవసరాలను (ఆధార్, ఆయుష్మాన్ నమోదు, ఎల్పీజీ సిలిండర్, వ్యక్తిగత గృహాలు) గుర్తించి, ఆయా పనుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. డ్వామా పీడీ పూర్ణిమాదేవి, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, ఐసీడీఎస్ పీడీ అనంతలక్ష్మి, బీసీ వెల్ఫేర్ డీడీ రాజేశ్వరి, డీఎల్‌డీవో మంజులవాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా అరకు కాఫీ ఫ్రాంచైజీలు

ఏయూక్యాంపస్: రాష్ట్రవ్యాప్తంగా అరకు కాఫీ ఫ్రాంచైజీ ఔట్‌లెట్లను ఏర్పాటు చేయడానికి సంబంధించిన నిబంధనలు, షరతులను ఖరారు చేసినట్లు జీసీసీ వైస్ చైర్‌పర్సన్ కల్పనా కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ సమక్షంలో జరిగిన సమీక్ష సమావేశంలో సంస్థ సామర్థ్యం, ఉద్యోగుల అభివృద్ధికి ఉపయుక్తంగా పలు నిర్ణయాలు తీసుకున్నట్లు ఆమె వెల్లడించారు. సంస్థలో ఉద్యోగులకు పదోన్నతులు కల్పించినట్లు చెప్పారు. సీనియర్ మేనేజర్ ఖాళీలను సైతం నెల రోజుల్లో భర్తీ చేయాలని నిర్ణయించామన్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు, కార్యనిర్వహణ పోస్టులను అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేస్తామన్నారు.

నిజరూపం.. అపురూపం



క్యూలైన్లలో కిక్కిరిసిపోయిన భక్తులు

- అప్పన్న నిజరూప దర్శనం చేసుకుని పరవశించిన భక్తులు
- తెల్లవారుజామున 2.45 గంటల నుంచి సర్వదర్శనాలు

సింహాచలం: వైశాఖ శుద్ధ తదియను పురస్కరించుకుని బుధవారం సింహగిరిపై జరిగిన చందనోత్సవానికి భక్తులు పోటెత్తారు. ఏడాదిలో ఒక్కరోజు మాత్రమే లభించే స్వామివారి నిజరూప దర్శనం చేసుకుని తరించారు. పాంచరాత్ర ఆగమ శాస్త్రం మేరకు బుధవారం తెల్లవారుజామున ఒంటి గంట నుంచి ఆలయ అర్చకులు వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. సుప్రభాతసేవ, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, కలశారాధన చేశారు. అనంతరం వెండి బొరుగులతో స్వామిపై ఉన్న పన్నెండు మణుగుల చందనాన్ని ఒలిచి నిజరూపభరితుడిని చేశారు. తదుపరి విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున 2.20 గంటల సమయంలో దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు స్వామి తొలిదర్శనాన్ని చేసుకున్నారు. అనంతరం సుమారు 2.45 గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. స్వామికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, టీటీడీ తరపున టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు పట్టువస్త్రాలు సమర్పించారు.

నిజరూపాన్ని దర్శించుకున్న ప్రముఖులు

అప్పన్న నిజరూపాన్ని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉప సభాపతి రఘురామకృష్ణంరాజు, ఎంపీలు శ్రీభరత్, కె.అప్పలనాయుడు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, విష్ణుకుమార్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ వీవీఎస్ మాధవ్, దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వినయ్‌చంద్, కమిషనర్ కె.రామచంద్రమోహన్, కలెక్టర్ హరేంధిరప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి తదితరులు స్వామిని దర్శించుకున్నారు. లక్షా 20 వేల మంది భక్తులు దర్శించుకున్నట్టు అధికారుల అంచనా.



స్వామికి చందనం తీసుకొస్తున్న ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు

పలుమార్లు వర్షంతో భక్తుల ఇక్కట్లు

తెల్లవారు జామున 2 గంటలు, సాయంత్రం 4 గంటల సమయంలో భారీ గాలులతో కురిసిన వర్షానికి భక్తులు ఇక్కట్లు పడ్డారు. వర్షంలో తడుస్తూనే స్వామి దర్శనానికి క్యూల్లో వేచి ఉన్నారు. సాయంత్రం నుంచి భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. ఒకపక్క సహస్ర ఘటాభిషేకం జరుగుతున్నా భక్తుల దర్శనాలు కొనసాగించారు. కొండ దిగువ పాత గోశాల జంక్షన్, అడవివరం జంక్షన్‌లో బస్సుల కోసం వేచి ఉన్న భక్తులు తడిసి ముద్దయ్యారు. ఉదయం కురిసిన భారీ వర్షాలకు పాత గోశాల జంక్షన్, అడవివరం జంక్షన్‌లో ఉన్న టెంట్‌లు నేలకొరిగాయి. ఘాట్ రోడ్డులో స్తంభం పడిపోవడంతో కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది.

ఘనంగా సహస్ర ఘటాభిషేకం

రాత్రి సహస్ర ఘటాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. పాంచరాత్ర ఆగమశాస్త్ర పండితులు త్రిదండి చిన జీయర్‌స్వామి పర్యవేక్షణలో సింహగిరిపై ఉన్న గంగధార నుంచి వెయ్యి కలశాలతో శ్రీవైష్ణవ స్వాములు జలాలను తీసుకువచ్చారు. ఆ జలాలతో స్వామి నిజరూపాన్ని అర్చకులు అభిషేకించారు. 108 వెండి కలశాలతో ఔషధ ద్రవ్యాలను స్వామికి అభిషేకించారు.



ఘటాభిషేకంలో పాల్గొన్న చినజీయర్‌స్వామి

అనంతరం స్వామికి విశేష పూజలు జరిపి, తొలివిడతగా సుమారు 125 కిలోల చందనాన్ని సమర్పించి, మళ్లీ నిత్యరూపభరితుడిని చేశారు.

పాలిసెట్‌కు 94 శాతం మంది హాజరు



నర్సీపట్నంలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల సందడి



అనకాపల్లిలో పాలిసెట్ పరీక్షకు హాజరైన విద్యార్థులు

తుమ్మపాల/అనకాపల్లి టౌన్/నర్సీపట్నం: జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన పాలిసెట్‌కు 94 శాతం మంది విద్యార్థులు హాజరై పరీక్షలు రాశారని జిల్లా కో-ఆర్డినేటర్ ఐవీఎస్ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం 9,049 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో బాలురు 4,974, బాలికలు 3,538 మంది హాజరయ్యారన్నారు. జిల్లావ్యాప్తంగా 23 కేంద్రాల్లో పాలిసెట్ పరీక్ష జరిగింది. అనకాపల్లిలో 14, నర్సీపట్నంలో 9 కేంద్రాలు ఏర్పాటు చేశారు. విద్యార్థుల సౌకర్యార్థం తాగునీరు, ప్రథమ చికిత్స కిట్‌లను అందుబాటులో ఉంచారు. నర్సీపట్నంలో 2,460 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. పరీక్షలకు 2,296 మంది హాజరయ్యారని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పరీక్ష నిర్వాహకుడు నర్సింహులు తెలిపారు.

కలెక్టరేట్‌లో బసవేశ్వరుని జయంతి వేడుక



బసవేశ్వరుని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, అధికారులు

తుమ్మపాల : లింగాయత్ సంప్రదాయాన్ని రూపొందించడంలో బసవేశ్వరుడు కీలక పాత్ర పోషించారని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. బసవేశ్వరుని జయంతి పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన వేడుకలో బసవేశ్వరుని చిత్రపటానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లింగ వివక్షను వ్యతిరేకించిన అభ్యుదయవాది బసవేశ్వరుడని అన్నారు. అన్నమయ్య, వేమన, వీరబ్రహ్మం భావాలలో విప్లవాత్మక మార్పులు రావడానికి పరోక్షంగా బసవేశ్వరుడు కారణమని తెలిపారు. పాల్కురికి సోమనాథుడు రచించిన బసవ పురాణం తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధమైందన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఇంచార్జి ఏవో వాసునాయుడు, కలెక్టరేట్ సెక్షన్ల సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అడవులను తాకట్టు పెట్టొద్దు...

- హైడ్రో పవర్‌ప్లాంట్ నోటిఫికేషన్ రద్దు చేయాలి
- సీపీఎం నేత వెంకన్న



సమ్మెదలో గిరిజనులతో కలిసి ఆందోళన చేస్తున్న సీపీఎం నేత వెంకన్న

దేవరాపల్లి : చింతలపూడి, వేపాడ మండలం మారిక గ్రామాల మధ్యలో అదాని హైడ్రోపవర్ ప్లాంట్ నిర్మాణానికి ఇచ్చిన నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న డిమాండ్ చేశారు. చింతలపూడి పంచాయతీలో బుధవారం పర్యటించిన ఆయన సమ్మెదలో స్థానిక గిరిజనులతో కలిసి ఆందోళన చేపట్టారు. అనంతరం వెంకన్న మాట్లాడుతూ పవన్ కల్యాణ్ అడవి బాట పట్టడం అంటే అడవులను తాకట్టు పెట్టడం కాదని విమర్శించారు. గిరిజనుల బతుకులు నాశనం చేసేందుకు అడవి బాట పట్టినట్టు అర్థమవుతుందని ఆరోపించారు. చింతలపూడి పంచాయతీలో శారదానదిపై ప్రాజెక్టులు నిర్మించి తద్వారా పంపింగ్ చేసి విజయనగరం జిల్లా వేపాడ మండలం కరకవలస పంచాయతీ శివారు మారిక గ్రామంలో 30 సర్వే నెంబర్లలో 213 ఎకరాల భూమి సేకరించి హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మించాలని నిర్ణయించారన్నారు. ఈ నిర్ణయాన్ని గిరిజనులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని స్పష్టం చేశారు. గిరిజనుల అభిప్రాయానికి వ్యతిరేకంగా ప్రభుత్వం ఎటువంటి పనులు చేపట్టినా ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. రైవాడ ప్రాజెక్టు జీవనదిగా ఉన్న శారదానదిపై అదాని కన్ను పడిందని ధ్వజమెత్తారు. రైవాడ ప్రాజెక్టు అదాని చేతుల్లోకి వెళ్లిపోవడంతో పాటు ఆయకట్టు భూములన్నీ బీడులుగా మారుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయకట్టు రైతులు, స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, స్థానిక గిరిజనులు రాజకీయాలకు అతీతంగా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

‘ఉల్లాస్’తో వయోజన విద్యకు ఊతం



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో సత్యనారాయణరావు

తుమ్మపాల : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘ఉల్లాస్’ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్లో ఉల్లాస్ కార్యక్రమంపై బుధవారం జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉల్లాస్ పథకంపై ప్రచారం చేసి, జిల్లాకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తిచేయాలన్నారు. 2025–26 సంవత్సరానికి 24,977 మందికి వయోజన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. అక్షరాస్యత శాతం తక్కువగా గల మండలాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పంచాయతీరాజ్, గ్రామ సచివాలయం, గ్రామీణాభివద్ధి, మహిళా శిశు సంక్షేమం, విద్యాశాఖ అధికారుల సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. అంగన్‌వాడీలు, పాఠశాలల్లో పనిచేస్తున్న కిందిస్థాయి సిబ్బంది, స్వయం సహాయక సంఘాలు, ఉపాధి హామీ, కార్మికుల్లో నిరక్షరాస్యులైన వారిని గుర్తించి ఆ సమాచారాన్ని వయోజన విద్య అధికారులకు అందజేయాలాని, వారిని ఈ పథకం ద్వారా అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛందంగా సేవలందించే టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వయోజన విద్య సహాయ సంచాలకుడు డి.చిన్నికృష్ణ, కమిటీ సభ్యులు డీఆర్డీఏ పీడీ శచీదేవి, జిల్లా, గ్రామ, వార్డు సచివాలయ అధికారి ఎస్.మంజులవాణి, మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ అనంతలక్ష్మి పాల్గొన్నారు.

పరవాడ ఎన్‌టీపీసీ నుంచి బూడిద (ఫ్లై యాష్) అక్రమ రవాణా జరుగుతోంది. పరిమితికి మించి లారీల్లో దీన్ని కాకినాడ తరలిస్తున్నారు. అధిక లోడుతో వెళ్లున్న ఈ బూడిద లారీలను టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహించి అధిక పెనాల్టీలు విధించడంతో ఈ పెనాల్టీల నుంచి తప్పించుకునేందుకు జాతీయరహదారిపై ఎక్కడికక్కడ డ్రైవర్లు ఇష్టానుసారం అన్‌లోడ్ చేసేస్తున్నారు. కొన్ని లారీలు టోల్ ఫీజు తప్పించుకోవడానికి మారుమూల గ్రామాల నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. ఇలా రోడ్డుపై ఎక్కడికక్కడ ఫ్లైయాష్‌ను అన్‌లోడ్ చేయడం వల్ల ఈ బూడిదంతా జాతీయరహదారిపై రాకపోకలు సాగించే వారి కళ్లల్లో పడి ఇబ్బంది పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే



టోల్‌ప్లాజా సమీపంలో రోడ్డు మధ్యలో దించేసిన ఫ్లైయాష్



ఇటీవల పోలీసులు పట్టుకున్న ఫ్లైయాష్ లారీలు

వాహన చోదకుల కంట్లో ఫ్లైయాష్

- ఎన్‌టీపీసీ నుంచి పరిమితికి మించి లారీల్లో అక్రమ రవాణా
- కూటమి నేతల అండదండలు
- టోల్‌ప్లాజాల వద్ద తనిఖీలు
- పెనాల్టీ కట్టకుండా రోడ్లపైనే అన్ లోడింగ్



జాతీయ రహదారి పక్కన అన్‌లోడ్ చేసిన ఫ్లైయాష్

నక్కపల్లి : రాజమండ్రి నుంచి కొద్దినెలలుగా బందరాళ్ల రాంబిల్లి ప్రాంతాలకు భారీ లారీల్లో తరలిస్తున్నారు. 40 టన్నులకు మించకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ ఒక్కో లారీలో 80 టన్నుల వరకు లోడు వేసి టోల్ ఫీజు నుంచి తప్పించుకునేందుకు వేంపాడు, చందనాడ, ఉపమాక మీదుగా జాతీయ రహదారిపై రాకపోకలు సాగిస్తున్నారు. తిరుగు ప్రయాణంలో ఇవే లారీల్లో పరవాడ వద్ద ఉన్న ఎన్‌టీపీసీ నుంచి వెలువడే ఫ్లైయాష్‌ను తీసుకుని కాకినాడ పోర్టుకు బయలుదేరుతున్నాయి. నిత్యం సుమారు 40 నుంచి 50 టిప్పర్ లారీల్లో ఈ బూడిదను 70 నుంచి 80 టన్నుల వరకు లోడింగ్ చేసి తీసుకెళ్తున్నారు. టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేసి ఓవర్ లోడ్ కారణంగా రూ.5 వేల వరకు పెనాల్టీ చెల్లిస్తే తప్ప టోల్‌గేట్‌లో నుంచి అనుమతించడం లేదు. దీంతో లారీ డ్రైవర్లు లారీలను కొద్దిదూరం వెనక్కి తీసుకెళ్లి సగం ఫ్లైయాష్‌ను రోడ్డుపక్కన, జాతీయరహదారి మధ్యలో అన్‌లోడ్ చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే ద్విచక్రవాహన చోదకులు, ఆటోల్లోను, బస్సుల్లోను ప్రయాణించేవారి కళ్లల్లో ఈ బూడిద పడి కళ్లు మండడం, సరిగ్గా కనిపించకపోవడం నీరు కారడం వంటి సమస్యలు వస్తున్నాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కన, మధ్యలో అన్‌లోడ్ చేసిన బూడిద విపరీతంగా వీచే గాలుల వల్ల దుమ్ము, ధూళి కలిపి సుడిగాలి మాదిరిగా చెలరేగి, అటువైపు రాకపోకలు సాగించేవారి కళ్లల్లో పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు లారీ డ్రైవర్లు అధిక లోడుతో ఉన్న లారీలను ఉపమాక, చందనాడ, అమలాపురం, వేంపాడు మీదుగా జాతీయ రహదారిపై చేరుకుని టోల్‌ప్లాజా తగలకుండా వెళ్లిపోతున్నారు. ఇలా రాకపోకలు సాగించే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో వేసిన ఇరుకు రోడ్ల మీదుగా వెళ్లే సమయంలో బూడిద గ్రామాల్లో వీధుల్లో పడి, ఆయా గ్రామాల వారు ఇబ్బంది పడుతున్నారు. 80 టన్నుల బరువుతో లారీలు రాకపోకలు సాగించడం వల్ల గ్రామీణ రోడ్లు శిథిలమవుతున్నాయని, ఎక్కడికక్కడ గోతులు పడుతున్నాయంటూ వారు ఆరోపిస్తున్నారు. ఇలా అధిక లోడుతో ఫ్లైయాష్‌ను తీసుకుని వెళ్తున్న మూడు టిప్పర్ లారీలను నక్కపల్లి సీఐ కుమారస్వామి పట్టుకుని కేసులు నమోదు చేశారు. అయినప్పటికీ ఈ దందా ఆగడం లేదు. ఉమ్మడి విశాఖ, కాకినాడ జిల్లాలకు చెందిన కొందరు కూటమి పెద్దల అండదండలు ఉండడంతో పోలీసులు, రవాణా శాఖ అధికారులు వీటిపై కన్నెత్తి చూడడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి ఫ్లైయాష్ అక్రమ రవాణాకు అడ్డుకట్టవేయాలని, ఎక్కడపడితే అక్కడ అన్‌లోడ్ చేస్తున్న లారీలపై కేసులు నమోదు చేసి వాహన చోదకుల కంటి చూపు కాపాడాలని పలువురు కోరుతున్నారు.

కశింకోట వరాహ లక్ష్మీనృసింహస్వామి నిజరూప దర్శనం



స్వామికి పాలతో అభిషేకం

కశింకోట : కశింకోటలోని పురాతన వరాహ నృసింహస్వామి ఆలయంలో భక్తులను స్వామి నిజరూప దర్శనం కనువిందు చేసింది. వైశాఖ శుద్ధ తదియ పురస్కరించుకొని సింహాచలం తరహాలో భక్తులకు స్వామి నిజ రూప దర్శనం బుధవారం కల్పించారు. స్వామికి వేకువ జామున వేద మంత్రాల నడుమ ఏడాది పొడవునా వేసిన చందనాన్ని తొలగించి నిజ రూప దర్శనాన్ని భక్తులకు కల్పించారు. ఈ సందర్భంగా భక్తులు బ్యాచ్‌ల వారీగా వచ్చి స్వామికి పంచామృతాలు, పండ్లు వగైరా సమర్పించి దర్శించుకున్నారు. భక్తులు తెచ్చిన పంచామృతాలైన తేనె, పాలు, పెరుగు,నెయ్యి, పంచదార, కొబ్బరి నీళ్లు, చందనంతో వేద మంత్రోశ్చరణల నడుమ ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పూలతో అందంగా అలంకరించారు. మధ్యాహ్నం వరకు నిజ రూప దర్శనం కల్పించ అనంతరం యధా విధిగా వేద మంత్రాల నడుమ చందనాన్ని పూశారు. మహిళలు భజన కార్యక్రమం నిర్వహించారు. ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకుడు అత్తిలి కోదండపాణి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

నర్సీపట్నం : చోరీ కేసులో నిందితుడుని అరెస్టు చేశామని టౌన్ సీఐ గోవిందరావు తెలిపారు. అబిద్ సెంటర్ సమీపంలోని ఇందిరా మార్కెట్‌లోని శ్రీలక్ష్మీ బాలాజీ ఆయిల్ మిల్‌షాప్ దుకాణంలో ఏప్రిల్ 24న జరిగిన చోరీపై దుకాణం యజమాని సిహెచ్.వెంకట రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసులో బొంతు వీధికి చెందిన నిందితుడు ఎస్.సాయిరామ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అతని వద్ద నుంచి నాలుగు ఆయిల్ టిన్‌లు రికవరీ చేశామన్నారు.

పెళ్లింట విషాదం

- శుభలేఖలు పంచడానికి వచ్చి తిరిగిరాని లోకాలకు..
- మర్రిబంద వద్ద రోడ్డు ప్రమాదంలో కోనసీమ జిల్లావాసి దుర్మరణం



మర్రిబంద వద్ద బోల్తా పడిన స్కూటీ, ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన నక్కా వెంకటేష్

యలమంచిలి రూరల్: మరో 15 రోజుల్లో పెళ్లి వేడుకలు జరగాల్సిన ఇంట్లో విషాదం అలముకుంది. శుభలేఖలు పంచడానికి వెళ్లిన ఇంటి పెద్ద, బావమరిది రోడ్డు ప్రమాదానికి గురి కావడం, బావమరిదిని మృత్యువు కబళించడంతో సందడిగా ఉండాల్సిన ఆ ఇల్లు శోక సంద్రమైంది. వివరాలివి.. కోనసీమ జిల్లా రామచంద్రపురం రైస్‌పేటకు చెందిన స్వర్ణకారుడు నక్కా వెంకటేష్ (37), తన బావమరిది అనుపోజు చంద్రశేఖర్ (40)తో కలిసి మే 15వ తేదీన జరగనున్న చంద్రశేఖర్ కుమార్తె వివాహ శుభలేఖలు పంచడానికి అనకాపల్లి వెళ్లారు. బంధువులకు శుభలేఖలు ఇచ్చి తిరిగి రామచంద్రపురం వెళ్తుండగా యలమంచిలి మండలం మర్రిబంద హైవే కూడలికి సమీపంలో వీరిద్దరూ ప్రయాణిస్తున్న స్కూటీ అదుపుతప్పి రోడ్డు పక్కగా ఉన్న ఇనుప రెయిలింగ్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో స్కూటీ వెనుక కూర్చున్న నక్కా వెంకటేష్ (37) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. స్కూటీ నడుపుతున్న చంద్రశేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడ్ని అంబులెన్సులో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన నక్కా వెంకటేష్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని బావ దిగుమర్తి వసంతరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు యలమంచిలి రూరల్ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదంలో దుర్మరణం పొందిన వెంకటేష్ కుటుంబసభ్యులు యలమంచిలి చేరుకుని మార్చురీలో భద్రపరచిన అతని మృతదేహాన్ని చూసి బోరున విలపించారు.

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

తుమ్మపాల : మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ ఆధ్వర్యంలో 2026 జనవరి 26న జరగనున్న రిపబ్లిక్ డే దినోత్సవం సందర్భంగా పద్మ అవార్డుల పురస్కారం కోసం వివిధ రంగాల్లో సేవలందించిన విశిష్ట ప్రతిభావంతుల నుంచి పద్మ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ కార్యాలయం నుంచి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్ట్, సోషల్ వర్కు, పబ్లిక్ ఎఫైర్స్, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, మెడిసన్, లిటరేచర్ అండ్ ఎడ్యుకేషన్, సివిల్ సర్వీసు, స్పోర్ట్స్ వంటి రంగాల్లో అత్యున్నత కృషి, సేవలను అందించిన విశిష్ట ప్రతిభావంతులు ఆన్‌లైన్' పద్ధతిన మాత్రమే నిర్ణీత నమూనాలో ఆధారిత డాక్యుమెంటేషన్‌తో పొందుపరుస్తూ దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఆన్‌లైన్‌లో https://awards.gov.in దరఖాస్తు చేసి ప్రతిపాదనలను ఒక కాపీ జిరాక్స్, సాఫ్ట్ కాపీని జూన్ 10 నాటికి జిల్లా యువజన సంక్షేమ అధికారి /ముఖ్యకార్యనిర్వాహణ అధికారి, సెట్విస్ కార్యాలయం, యువజన భవన్, మహారాణిపేట, విశాఖపట్నం వారికి సమర్పించాలన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కశింకోట-అనకాపల్లి రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహం

అనకాపల్లి : కశింకోట–అనకాపల్లి రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని సుమారుగా 35 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి మృతి చెందినట్టు దువ్వాడ జీఆర్పీ ఎస్ఐ కె.టి.ఆర్.లక్ష్మి బుధవారం చెప్పారు. మృతుడి ఎత్తు 5.6 అడుగులు, జుట్టు నలుపు రంగు, ఎరుపు రంగు టీషర్టు, బ్లాక్ ఫుల్ జీన్‌ప్యాంట్ కలిగి ఉన్నట్టు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మరిన్ని వివరాలకు సెల్‌నంబర్ 7382058996 ను సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

మేడపై నుంచి జారిపడి జవాన్ మృతి



మృతుడు పూసర్ల కృష్ణ, అప్పికొండవానిపాలెం

మునగపాక : మండలంలోని మల్లవరం పంచాయతీ అప్పికొండవానిపాలెం గ్రామానికి చెందిన సీఎస్ఎఫ్ జవాన్ పూసర్ల కృష్ణ (36)మేడపై నుంచి జారిపడి మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. అప్పికొండవానిపాలెం గ్రామానికి చెందిన కృష్ణ సీఎస్ఎఫ్ జవాన్‌గా శ్రీనగర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. వేసవి సెలవుల్లో భాగంగా ఇటీవల గ్రామానికి చేరుకున్న కృష్ణ మంగళవారం రాత్రి సోదరుని ఇంటి డాబాపైకి వెళ్లాడు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తూ డాబాపై నుంచి కిందపడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతనిని అనకాపల్లి వందపడకల ఆస్పత్రికి తరలించారు. అప్పటికే కృష్ణ మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారు. ఈ మేరకు మునగపాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడు కృష్ణకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న కృష్ణ మృతితో ఆ కుటుంబంలో విషాదం అలముకుంది.

తల్లీ కుమార్తెలకు అవార్డులు



రోలుగుంట ఇంగ్లీష్ టీచర్ నాగజ్యోతి, ఆమె కుమార్తె సాహితిలను సత్కరిస్తున్న ప్రతినిధులు

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న పీవీఎం నాగజ్యోతి, ఆమె కుమార్తె కలగర్ల సాహితీలకు మరోసారి అవార్డులు వరించాయి. విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వారికి ఈ పురస్కారాలు అందించారు. విద్యారంగంలో విశేష కృషి చేస్తున్న నాగజ్యోతికి 'ఇంటర్నేషనల్ బెస్ట్ ఎచీవర్ అవార్డు', క్రీడల్లో రాణిస్తున్న ఆమె కుమార్తె సాహితికి 'భారత్ సమ్మాన్ అవార్డు' వరించాయి. ప్రెస్ క్లబ్ వెల్ఫేర్ వరల్డ్ వైడ్ ఫౌండేషన్ ఈ అవార్డులను అందజేసింది.

ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

మునగపాక : ఆర్థిక ఇబ్బందులు తాళలేక మండలంలోని అరబుపాలెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పురుగు మందు తాగి మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. అరబుపాలెం గ్రామానికి చెందిన తల్లి దుర్గా ప్రసాద్(35) ఆటోను నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. దుర్గా ప్రసాద్ ఇంటి నిర్మాణం కోసం సుమారు రూ.10 లక్షల వరకు పలు రూపాల్లో అప్పులు చేశాడు. ప్రతి నెలా వడ్డీ చెల్లిస్తూ వస్తున్నాడు. తీసుకున్న రుణం చెల్లించే పరిస్థితులు కనిపించకపోవడంతో మద్యానికి బానిసవుతూ వచ్చాడు. ఆర్థిక ఇబ్బందులు పెరిగి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతనిని విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. వైద్యం పొందుతూ దుర్గా ప్రసాద్ మృతి చెందాడు. మృతుడి భార్య ఆశ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మునగపాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక డీఎస్సీ కోసం ముట్టడి

- మూడు ఐటీడీఏల వద్ద ఆదివాసీ డీఎస్సీ సాధన కమిటీ, ఆదివాసీ ప్రజా సంఘాల ఆందోళన
- నూరుశాతం ఉద్యోగాల జీవోను వెంటనే తేవాలని డిమాండ్



పాడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీ ప్రజాసంఘాలు, ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ ప్రతినిధులు,విద్యార్థులు

సాక్షి,పాడేరు: ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ, ఆదివాసీ ప్రజా సంఘాల నాయకులు, నిరుద్యోగుల నినాదాలతో జిల్లాలో ఐటీడీఏ కార్యాలయాల ప్రాంగణాలు హోరెత్తాయి. జీవో నంబర్ 3 పునరుద్ధరించాలని, ప్రత్యేక డీఎస్సీ ఆర్డినెన్స్ జారీ చేయాలని డిమాండ్ చేస్తూ ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ, ఆదివాసీ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివాసీ సంఘాల నాయకులు, నిరుద్యోగ యువకులు పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏలను బుధవారం పెద్ద ఎత్తున ముట్టడించారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో కొద్ది సేపు రోడ్లపై బైఠాయించారు. పాడేరులో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున యువకులు పాల్గొన్నారు. అంతకుముందు పాడేరు వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. వినతిపత్రం ఇచ్చేందుకు పాడేరులో ఐటీడీఏ కార్యాలయం లోనికి వెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులను పోలీసులు అడ్డుకోవడంతో వారంతా రోడ్డుపైనే బైఠాయించారు. నూరుశాతం ఉద్యోగాల జీవోతో పాటు ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావుకు డీఎస్సీ సాధన కమిటీ ప్రతినిధులు వినతిపత్రం అందజేసి, ప్రభుత్వానికి తమ డిమాండ్లను తెలియజేయాలని కోరారు.

మే 2 నుంచి నిరవధిక మన్యం బంద్

పత్యేక డీఎస్సీ ప్రకటించి, ఆదివాసీలకు న్యాయం చేసేంతవరకు ఆందోళనలు కొనసాగిస్తామని, మే 2 నుంచి నిరవధిక మన్యం బంద్ నిర్వహిస్తామని ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ తెలిపింది. ఈ కార్యక్రమంలో అనంతగిరి జెడ్పీటీసీ డి.గంగరాజు, డీఎస్సీ సాధన కమిటీ ప్రతినిధులు కుడుముల కాంతారావు, పి.అప్పలనర్స, ఎస్.మాణిక్యం,కూడా సుబ్రహ్మణ్యం, కూడా రాధాకృష్ణ, ధర్మాన పడాల్, పి.బాలదేవ్, సురేంద్ర, హైమావతి, వల్లా సలీం, వంతాల నాగేశ్వరరావు, దాస్, సింహాద్రి, డి.పి.శంకర్, టి.కృష్ణారావు, జీవన్, కార్తీక్, ఎస్.కొండలరావు, బి.కేజీయారాణి, చిన్నస్వామి, చిన్నారి, చిరంజీవి, ప్రశాంత్‌కుమార్, బాలరాజు, లక్ష్మణరావు, మత్స్యరాస వెంకటరాజు, పిట్ట నరేష్‌తో పాటు పలు ఆదివాసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

రంపచోడవరం: సీఐటీయూ, ఏపీ గిరిజన సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ఐటీడీఏ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్ నుంచి నిరసన ప్రదర్శన నిర్వహించి ఐటీడీఏ ఎదుట బైఠాయించారు.ఈ సందర్భంగా గిరిజన సంఘం అధ్యక్షుడు లోతా రామారావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు అరకులోయలో ఇచ్చిన హామీ మేరకు ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని, నూరు శాతం ఉద్యోగాలు గిరిజనులకే వర్తించేలా జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆందోళనకారులను అడ్డుకున్న పోలీసులు

వినతిపత్రం ఇచ్చేందుకు బయటకు రావాలని గిరిజన సంఘాలు కోరగా, బయటకు రావడానికి ఐటీడీఏ పీవో ఆసక్తి చూపలేదు. దీంతో ఐటీడీఏ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సమయంలో గిరిజనులు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఆగ్రహించిన గిరిజన యువత రోడ్డుపై బైఠాయించడంతో మూడు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. కొద్ది సేపటి తర్వాత పీవో కట్టా సింహాచలం బయటకు రావడంతో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ చైతన్య వేదిక అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి,ఆదివాసీ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు తీగల బాబురావు, సీపీఎం నాయకులు మట్ల వాణిశ్రీ, సిరిమల్లిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంఘాల నాయకులు, నిరుద్యోగ యువత, డీఎస్సీ అభ్యర్థులు స్థానిక ఐటీడీఏ ఎదుట ఆందోళన చేశారు. జీవో నంబర్ 3 పై ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకుని ఆదివాసీ నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల ప్రత్యేక చట్టాలను ప్రభుత్వం నీరుగారుస్తోందని, ఉన్నత చదువుల్లో అడుగుపెడుతున్న ఆదివాసీ యువత జీవోల రద్దు కారణంగా తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఓట్లకోసం జీవోను పునరుద్ధరిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక దానిని విస్మరించడం తగదని, ప్రత్యేక డీఎస్సీ ప్రకటించి ఆదివాసీ యువతకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ కోసం ఈనెల రెండున నిర్వహిస్తున్న మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం వారు ఐటీడీఏ పీవో అపూర్వభరత్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్, సున్నం రాజులు, సీసం సురేష్, పల్లపు వెంకట్, మడివి రవితేజ, అగరం సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అమరావతి అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

అనకాపల్లి: అమరావతి అభివృద్ధికి కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రూ. 50 వేల కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించాలని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2015లో ప్రధాని మోదీ శంకుస్థాపన చేసి రాష్ట్రానికి చెంబుడు నీళ్ళు, గుప్పెడు మట్టి తప్ప నిధులేమీ ఇవ్వలేదన్నారు. అమరావతి రాజధాని, మోదీ పర్యటన గురించి ఊదరగొడుతున్న రాష్ట్ర ప్రభుత్వం, షర్మిల పర్యటనను ఎందుకు అడ్డుకుంటుందో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

నేటి నుంచి కిక్ బాక్సింగ్, కరాటే శిక్షణ

అనకాపల్లి: స్థానిక ఉడ్‌పేట ఎలిమెంటరీ పాఠశాలలో గురువారం నుంచి స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా వేసవి శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు అసోసియేషన్ వ్యవస్థాపకుడు ఉమా వెంకట మహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు ఉదయం 6 నుంచి 8 గంటల వరకూ కరాటే, కిక్‌బాక్సింగ్‌లో శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన బాలబాలికలు, యువకులు 97044 71628 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

కొనసాగుతున్న వేసవి శిబిరం



తాళ్లపాలెంలో ఉన్న శాఖా గ్రంథాలయంలో కుర్చీలాట ఆడుతున్న విద్యార్థులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో ఉన్న శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. విద్యార్థులకు బుధవారం ఖోఖో, కుర్చీలాట నిర్వహించారు. విద్యార్థులతో కథలు చెప్పడం, పుస్తక పఠనం నేర్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నాయుడు, గ్రంథాలయ అధికారి కె.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు కొవ్వొత్తులతో నివాళి



కశింకోటలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ సైనికులు

కశింకోట: కశింకోటలో మాజీ సైనికులు కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో అశువులు బాసిన అమాయక పర్యాటకుల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ బుధవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన చేసి నివాళులర్పించారు. స్థానిక పొట్టి శ్రీరాములు పార్కు నుంచి ప్రారంభమైన ప్రదర్శన ప్రధాన రహదారి మీదుగా జాతీయ రహదారి వరకు సాగింది. ఎక్కువ మంది మాజీ సైనికులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 775 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్టధర	గరిష్టధర
మొదటి రకం	4,010	4.590
రెండో రకం	3,780	4,350
మూడో రకం	3,200	3,800

అనకాపల్లి సినిమాలు

రాజా : జింఖానా
సత్యనారాయణ స్క్రీన్-1: అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి
సత్యనారాయణ స్క్రీన్-2 : సారంగపాణి జాతకం
పర్తిసాయి : హిట్
షిర్డీసాయి : అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి
వెంకటేశ్వర : పాఠం
శ్రీసత్య : భరత్ అనే నేను
రామచంద్ర : తుడరుమ్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 44 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-6 యూనిట్లు, ఓ పాజిటివ్-31 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ.లోకేష్‌ను ఫోన్ నంబర్ 97036 19706లో సంప్రదించవచ్చు

గ్యాస్ సమాచారం

అనకాపల్లి:ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 383 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 201 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని ఫోన్ నంబర్ 08924-223595లో సంప్రదించవచ్చు.

ఇప్పట్లో గృహయోగం లేనట్టేనా?

- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా పేదలకు మంజూరు చేయని ఇళ్లు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 2268 ఇళ్ల మంజూరు
- వాటిలో 1267 పూర్తి.. వివిధ దశల్లో మిగతా ఇళ్ల నిర్మాణం



కశింకోటలోని వడ్డి వీధిలో నిర్మించిన వైఎస్సార్ జగనన్న మెగా కాలనీ



కాలనీలో నిర్మించిన ఇళ్లు

కశింకోట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా పేదలకు ఒక్క ఇళ్లు కూడా మంజూరు చేయలేదు. కొత్త ప్రభుత్వం ఇప్పట్లో గృహయోగం కనిపించడం లేదని పేదలు నిట్టూరుస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మండలంలో 2,268 మందికి ఇళ్లు మంజూరు చేశారు. వాటిలో 1267 ఇళ్లు ఇప్పటికే పూర్తి అయ్యాయి. మిగతా ఇళ్లలో వివిధ స్థాయిలో నిర్మాణంలో ఉన్నాయి. ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరుకు వీటిని పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది.

ఓట్ల కోసం హామీలు

కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు 3 సెంట్ల చొప్పున స్థలం, ఇళ్లు మంజూరు చేసి నిర్మించనున్నట్లు హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నప్పటికీ ఏ ఒక్కరికి ఇల్లు ఇవ్వలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో 2,268 మందికి ఇళ్లు మంజూరు చేశారు. స్థలం లేని వారికి సెంటున్నర స్థలాన్ని కూడా సమకూర్చింది. కశింకోట వంటి ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలం లేనిచోట భూమిని కొనుగోలు చేసి మరీ స్థలాన్ని కేటాయించింది. కూటమి ప్రభుత్వంలో మాత్రం ఇప్పటికీ సెంటు భూమి కూడా ఇవ్వలేదు. సొంత స్థలం ఉన్న వారు దరఖాస్తు చేసుకుంటే ఇళ్లు మంజూరు చేస్తామనడంతో ఆన్‌లైన్‌లో అందుకు 986 మంది ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారు. వారికి కూడా ఇళ్ల మంజూరు చేయలేదు. వీరిలో అర్హులను ఎంపిక చేయనున్నట్టు చెబుతున్నారు. దీంతో ఎంత మందికి ఇళ్ల మంజూరు చేస్తారో తెలియక పేదలకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఇక స్థలం లేని వారికి ఇంటి స్థలం ఇవ్వడం గురించి ఇంకా ప్రతిపాదనే రాలేదు. గత వైఎస్సార్ సీపీ హయాంలో ఒక్కొక్క ఇంటికి రూ.1.80 లక్షల ఆర్థిక, మెటీరియల్ సహాయం అందించింది. దీంతో చాలా వరకు ఇళ్లు నిర్మించుకుని ఆనందంగా నివాసం ఉంటున్నారు. గత ప్రభుత్వం అధికారంలో ఉండగానే దాదాపు సగం ఇళ్లు పూర్తయ్యాయి. గత ఏడాది కాలంలో మాత్రం 151 ఇళ్లు పూర్తయ్యాయి. వీటితో కలిపి 1267 ఇళ్లు పూర్తియినట్టు అధికారిక సమాచారం. మిగతావి వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. వీటి పూర్తి చేయడానికి ఎస్సీ, బీసీ, ఎస్టీలకు అదనంగా ఆర్థిక సహాయాన్ని అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు 75 వేలు వివిధ నిర్మాణ దశల్లో ఇళ్లకు నాలుగు విడతలుగా అందివ్వనున్నారు. ఇళ్లను ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని, లేదంటే ఈ పథకం రద్దు చేయనున్నట్లు ప్రకటించింది. దీంతో గృహ నిర్మాణాలు జోరందుకున్నాయి. అయితే చెల్లింపులు జరపడంలో జాప్యం చేస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు.

కొత్త గృహాలు మంజూరు కాలేదు

కొత్త గృహాలు మంజూరు కాలేదు. సొంత స్థలాలు ఉన్నవారు కొత్త గృహాల కోసం 986 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. ఇంకా దరఖాస్తు చేయడానికి ప్రస్తుతం గడువు ఉంది. వీరిలో అర్హులను ఎంపిక చేసి ఇళ్లు మంజూరు చేస్తారు. ఒక్కొక్క ఇంటికి అందించే ఆర్థిక సహాయాన్ని రూ.2.80 లక్షలకు పెంచుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన 2,268 ఇళ్లలో 1267 పూర్తి అయ్యాయి. మిగిలినవి వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. వీటిని ఈ ఏడాది డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని, లేదంటే రద్దు అవుతాయని నిర్దేశించారు.

– వి.శ్రీనివాసరావు, ఏఈ, హౌసింగ్, కశింకోట

గౌరీ గ్రంథాలయంలో నేటి నుంచి కంప్యూటర్ శిక్షణ

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో కంప్యూటర్ శిక్షణ తరగతులు గురువారం నుంచి జరగనున్నాయని గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ తెలిపారు. వివేకానందా చారిటబుల్ ట్రస్ట్ కంప్యూటర్ హాల్‌లో జరగనున్న ఈ తరగతులు ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగనున్నాయని పేర్కొన్నారు. నామమాత్రపు రుసంతో నిర్వహించే ఈ తరగతులలో సర్టిఫికెట్ ఇన్ కంప్యూటర్ కాన్‌స్పెప్ట్స్, ఎంఎస్-ఆఫీస్, ఎంఎస్-వర్డ్, ఎక్సెల్, ఇంటర్‌నెట్ కాన్‌స్పెప్ట్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌కు అవసరమైన సర్టిఫికెట్లు జారీ చేస్తామన్నారు.

ఎస్‌ఐ షేక్ రషీద్‌కు వీడ్కోలు సత్కారం



షేక్ రషీద్ బాషా దంపతులను సత్కరిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ దేవప్రసాద్

అనకాపల్లి: పోలీస్ శాఖలో అంకిత భావంతో విధుల నిర్వహించిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని జిలా అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్ అన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో బుధవారం ఎలమంచిలి టౌన్ పోలీస్ స్టేషన్‌లో అదనపు ఎస్‌ఐ షేక్ రషీద్ బాష పదవీ విరమణ సందర్భంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖలో 38 సంవత్సరాల సుదీర్ఘ సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయంల ఏవో రామకుమార్, సీఐలు లక్ష్మణమూర్తి, బెండి వెంకట్రావు, లక్ష్మీ, ఎస్‌ఐలు వెంకన్న, సురేష్‌బాబు, విశ్వనాథం, శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో వర్షం



నీట మునిగిన విజయరామరాజు పేట రైల్వే అండర్ బ్రిడ్జి



కశింకోటలోని గవరపేట మధ్య వీధిలో ప్రవహిస్తున్న వర్షపు నీరు

అనకాపల్లి టౌన్: పట్టణంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండతో ఇబ్బంది పడిన ప్రజలు మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చి సుమారు గంట సేపు వర్షం పడింది. వర్షం 22.5 మిల్లీమీటర్లుగా నమోదైంది. దీంతో విజయరామరాజు పేట రైల్వే అండర్‌బ్రిడ్జి, గవరపాలెం పార్కు సెంటర్, తదితర ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి.

కశింకోట: కశింకోట ప్రాంతంలో బుధవారం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. దీంతో గవరపేట, గాడి వీధి, జగనన్న కాలనీ తదితర లోతట్టు ప్రాంతాల్లో అడుగులోతు నీరు ప్రవహించింది. రాకపోకలు సాగించడానికి ప్రజలు, వాహన చోదకులు ఇబ్బంది చెందారు. వర్షం తగ్గిన తర్వాత విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మంగళవారం రాత్రి 2 గంటల ప్రాంతంలో కూడా పెను గాలులతో వర్షం కురిసింది. పెద్ద ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షం వల్ల ప్రజలు భయాందోళన చెందారు. పెను గాలుల వల్ల మామిడి కాయలు రాలిపోయి పంటకు నష్టం కలిగిందని రైతులు ఆవేదన చెందారు. విద్యుత్ సరఫరాకు సుమారు 2 గంటల పాటు అంతరాయం కలిగింది. తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

చెత్త నుంచి సంపద సృష్టికి అడుగులు



కశింకోటలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి

కశింకోట: చెత్త నుంచి సంపద సృష్టించడానికి అడుగులు పడుతున్నాయని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి అన్నారు. కశింకోటలోని సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. దాని పని తీరును పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్య పనుల నిర్వహణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి పంచాయతీలు మరింత ఆదాయాన్ని సమకూర్చుకునేలా కార్యాచరణ రూపొందించిదన్నారు. కశింకోట సంపద కేంద్రం జిల్లాలోనే ఆదర్శంగా ఉంటుందన్నారు. ప్రభుత్వంతో పాటు ప్రజల సంకల్పం కూడా తోడైతే గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యం సాధ్యమవుతుందన్నారు. దీని దృష్ట్యా తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ సిబ్బందికి అందజేయాలన్నారు. తడి చెత్తను సంపద కేంద్రానికి తరలించి సేంద్రియ ఎరువు తయారు చేస్తారన్నారు. దాన్ని విక్రయించడం ద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం సమకూరి అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు ఉపయోగపడనుందన్నారు. ఈవోపీఆర్డీ ఎం.వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఎస్.రామచంద్రరావు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై వీఆర్‌ఏల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు

తుమ్మపాల: గ్రామాన్ని అంటిపెట్టుకుని అనేక రకాల రెవెన్యూ సేవలు అందిస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకుల(వీఆర్ఏ)కు జీతాలు పెంచి పే-స్కేలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.లోకనాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద బుధవారం వీఆర్ఏలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు బ్రిటిష్ కాలం నుంచి గ్రామాల్లో పనిచేస్తున్నారని, గ్రామంలో ప్రభుత్వ భూములు పరిరక్షణతో పాటు భూముల వివరాలపై అవగాహనతో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలను అందిస్తున్నారన్నారు. గ్రామ సేవకులకు గౌరవ వేతనం పేరుతో అతి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని, నెలకి ఇచ్చే రూ.10,500 జీతంతో గ్రామ సేవకుల జీవనం దుర్భరంగా ఉందన్నారు. రెవెన్యూ సర్వేలు, రీసర్వేలు పేరుతో కార్యాలయాలకు, గ్రామాలకు తిరిగే చార్జీలకే జీతం ఖర్చు అయిపోతుందన్నారు. గతంలో ఇచ్చే డీఏ కూడా ఉపసంహరించారన్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా పదోన్నతి కల్పించకపోవడం దారుణమన్నారు. తెలంగాణ రాష్ట్రం వలే వీఆర్ఏలకు పేస్కేల్ అమలు చేయాలన్నారు. సమస్యల పరిష్కారంపై చొరవ చూపాలని, లేని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు రాత్రిపూట తహసీల్దార్ కార్యాలయాల వద్ద నైట్ వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నారని, ఇటీవల డ్యూటీలో ఉండగా కశింకోటలో వీఆర్ఏ గుండెపోటుకు గురయ్యారన్నారు. ఎటువంటి ఉత్తర్వులు లేకుండా నైట్ డ్యూటీలు వేయడం అన్యాయమన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రవికుమార్, ఎస్.గంగాధర్, జిల్లా కోశాధికారి సంతోష్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతి కుమారి, తోటాడ సింహాచలం, పరదేశినాయుడు, వి.రమణ, నరేంద్ర పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు చేయాలి



సూపరింటెండెంట్ శేషుకు వినతిపత్రం అందజేస్తున్న వి.వి.శ్రీనివాసరావు

అనకాపల్లి: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని ఎన్‌హెచ్‌ఎం కంటింజెంట్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణలో డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయంలో సూపరింటెండెంట్ శేషుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటింజెంట్ వర్కర్స్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 20 నుంచి 30 సంవత్సరాలుగా రోగులకు సేవలు అందిస్తున్నారని, తమ సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఎనిమిది పని గంటలు, నిర్దిష్టమైన జాబ్‌చార్టు, షిఫ్ట్ డ్యూటీలు అమలు చేయాలని, నేషనల్ అండ్ స్టేట్ పబ్లిక్ సెలవులు ఉపయోగించుకునేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం జేఏసీ సభ్యులు రామకృష్ణ, సూర అప్పారావు, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ ప్యాకెట్స్‌ను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ మందపాటి సునీత జానకీరామరాజు దంపతులు

అనకాపల్లి: వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే ప్రయాణికుల దాహం తీర్చేందుకు చలివేంద్రాలను యువత ఏర్పాటు చేయాలని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు కోరారు. స్థానిక ఉమ్మలాడ జంక్షన్ వద్ద మాజీ కౌన్సిలర్ దాడి భోగ లింగేశ్వర రావు ఆధ్వర్యంలో అక్షయ తృతీయ పర్వదినం పురస్కరించుకుని ఉచిత మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ పట్టణ పరిధిలో చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గైపూర్ రాజు, గొన్నబత్తుల రమణ, పాలమరశెట్టి ఓం నమఃశివాయ, పి.శ్రీనివాసరావు, దాడి సూరిబాబు, మళ్ల బలరాం, స్వామి, కాండ్రేగుల సతీష్, కామేష్, పాల్గొన్నారు.

సింహాచలం ఘటనకు కారణమైన బాధ్యులను సస్పెండ్ చేయాలి



ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న హరనాథ్‌బాబు

అనకాపల్లి టౌన్: సింహాచలం దేవస్థానం ఆవరణలో గోడ కూలి ఏడుగురు మంది భక్తులు మరణించిన సంఘటనలో దేవస్థానం ఈవోని బాధ్యులను చేసి సస్పెండ్ చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ కొణతాల హరినాథ్‌బాబు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బుధవారం ఏవో సుధాకర్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. సామాన్య భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యి, రూ.300 దర్శనంలో ప్రత్యేక శ్రద్ధ చూపించడం చూస్తేంటే భక్తుల ప్రాణాల కంటే ఆదాయమే ముఖ్యమన్నట్లు అధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

అనకాపల్లి టౌన్: సింహాచలం దేవస్థానంలో గోడ కూలి భక్తులు మరణించిన సంఘటన అత్యంత బాధాకరమని బీఎస్‌పీ, సీపీఐ, ప్రజా సంఘాల నేతలు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేవస్థానాలను పర్యాటక ప్రదేశాలుగా మారుస్తూ వాటిపై వస్తున్న ఆదాయం మీదే దృష్టి సారిస్తున్నారే తప్పా భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో నూదికొండ మాణిక్యాలు రావు, కొరిబిల్లి శంకర్రావు, మతుర్తి సూరిబాబు, కట్టమూరి మంగరాజు, ఆచారిలు పాల్గొన్నారు.

మోహన్‌రావు సేవలు స్ఫూర్తిదాయకం



మోహన్‌రావు దంపతులను సత్కరిస్తున్న కలెక్టరేట్ ఉద్యోగులు

తుమ్మపాల: ప్రభుత్వ ఉద్యోగి విజయవంతంగా విధి నిర్వహణ సాగించాలంటే వృత్తి పట్ల నిబద్ధత, సమయస్ఫూర్తి కలిగి ఉండాలని జిల్లా మత్స్యశాఖ అధికారి ప్రసాద్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని మత్స్యశాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ పొడుగు మోహన్‌రావు బుధవారం పదవీ విరమణ సందర్భంగా సత్కార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోహన్‌రావు ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పని చేసి అందరి మన్ననలు పొందారన్నారు. విధుల పట్ల ఆయన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. సన్మాన గ్రహీత మోహన్‌రావు మాట్లాడుతూ అధికారులు, తోటి ఉద్యోగుల సహకారంతోనే 33 సంవత్సరాలు ఉద్యోగ బాధ్యతలను సాఫీగా నిర్వర్తించగలిగానని చెప్పారు.

చెరువును తలపిస్తున్న రహదారి



చెరువును తలపిస్తున్న నూకాంబిక అమ్మవారి జాతీయ రహదారి ఆర్చ్ రహదారి

అనకాపల్లి టౌన్: గవపాలెం నూకాంబిక అమ్మవారి జాతీయ రహదారి ఆర్చ్ మార్గం చెరువును తలపిస్తుంది. జాతీయ రహదారి నుంచి ఇటు విశాఖవైపు, అటు కాకినాడ వైపు వచ్చే వాహనాలన్నీ ఈ రహదారి మీదుగానే అమ్మవారి ఆలయానికి చేరుకుంటాయి. ఎంతో ప్రాధాన్యత ఉన్న ఈ రహదారి కొద్దిపాటి వర్షానికే చెరువును తలపిస్తుంది. ఈ ప్రాంతం మీదుగానే గవరపాలెంకు చెందిన రైతులు జాతీయ రహదారి అవతల వైపు ఉన్న ఆవఖండం, తోటాడ, గవర్ల అనకాపల్లిలో ఉన్న పొలాలకు నడిచి వెళుతుంటారు. వీరందరూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే ఈ రహదారిని బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చందన స్వామి భక్తులకు స్వచ్ఛంద సేవ

తొలిసారిగా చిన్న లడ్డూ ప్రసాదం వితరణ



అన్నప్రసాద భవనంలో భక్తులకు పొంగలి, కదంబం అందిస్తున్న దేవస్థానం సిబ్బంది



భక్తులకు తొలిసారిగా దేవస్థానం తరఫున లడ్డూ ప్రసాదాన్ని అందిస్తున్న ఆంధ్రాబ్యాంకు సిబ్బంది



సింహగిరిపై భక్తుడికి బీపీ చెక్ చేస్తున్న అడవివరం ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది

సింహాచలం: చందనోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సింహగిరిపైన, కొండదిగువ పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు విశేష సేవలందించాయి. క్యూల్లోను, బస్టాండ్ ప్రాంగణంలో, దర్శనానంతం ఆలయ దక్షిణ రాజగోపురం నుంచి వెలుపలకు వచ్చే మార్గంలో, కొండదిగువ పాతగోశాల జంక్షన్, పాత అడవివరం జంక్షన్ తదితర ప్రాంతాల్లో భక్తులకి ఆహారపదార్థాలు, పానీయాలు, స్నాక్స్ అందించాయి.

- అడవివరం ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో సింహగిరిపైన, కొండదిగువ మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి, వైద్య సేవలు అందించారు.
- సింహగిరిపై అన్నప్రసాద భవనంలో నిర్విరామంగా దద్యోజనం, కదంబంను దేవస్థానం ప్రత్యేకంగా అందజేసింది.
- దర్శనానంతరం భక్తులు బయటకు వచ్చే దక్షిణ రాజగోపురం మార్గంలో దేవస్థానం తొలిసారిగా చిన్న లడ్డూ ప్రసాదాన్ని పంపిణీ చేసింది.
- గోపాల్‌బాబు ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అరటి పండ్లు, సింహగిరి బస్టాండ్‌లో హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో పానకం అందజేశారు.